# తోడల్లుడు

-ఆకెళ్ళ గిరిజ

**దేశంలో అందరికీ అన్ని రకాల గండాలూ ఉంటాయి. నాకు మాత్రం పండగ గండం ఉందనిపిస్తుంది. పండగొస్తోంది అంటేచాలు - బాబోయ్ వద్దురా నాయనా అనిపించేలా తయారైంది నా పరిస్థితి!**

చాలామందికి ఇది ఆశ్చర్యంగా కనిపించొచ్చు. అతిశయోక్తిలా అనిపించవచ్చు కానీ - నామట్టుకు నాకు పచ్చినిజం!

అదెలాగంటే - "పండగ... అక్కడికొచ్చేయండి" అంటూ మా మామగార్నుండి ఫోను లేదా ముఖాముఖీ ఆహ్వానం!

తీరావెళితే అప్పటికే మా మిగతా తోడళ్ళుళ్ళిద్దరూ - పిల్లాపాప, గొడ్డూగోదాతో వచ్చి ఉంటారు. అందరం కలిశాం కదా - ఏదో కాస్త ఆనందంగా గడపుదామను కుంటే - చివరికి అది అత్యాశే అవుతుంది.

సైజులవారీ పిల్లలంతా ఒకచోట చేరి - కాకిగోల - మేకగోల - కొండొకచో కోళ్ళ ఫారమ్‌లా తయారు చేస్తారు.

దాన్నెలాగోలా భరిద్దాం అనుకుంటే - మొదలవు తుంది మొహాలుకడిగే దగ్గర క్యూ! అది దాటి బయటపడితే - కాఫీ నీళ్ళు అందడానికో అరగంట!

ఈలోగా గబగబా వస్తారు మా మద్రాసు తోడల్లుడు.

"రావు గారూ! చంపిపారేస్తోందండి జయలలిత. సారీ! అదే లిక్కర్... ఇక్కడ దొరకట్లేదా... నెక్స్ట్ టైమ్ మీరు మద్రాసు రండి. మందులో ఊరేస్తాను. కానీమధ్య కొత్తగా కంపెనీ మారాను. ఆ కంపెనీ వాళ్ళు మొహం కూడా మందుతోనే కడుక్కుంటారు..."

వగైరాలతో మొదలెట్టి - అధమా మనకి స్పృహతప్పే వరకూ వాయించి తప్పు కుంటాడు.

సరిగ్గా అదేటైములో వచ్చి సెటిలవుతాడు మా రెండో తోడల్లుడు మోహన్.

"గురూ గారూ! నేను ఢిల్లీలో ఉన్నప్పుడు అస్సలీ కాఫీ తాగే వాణ్ణి కాదు - మొత్తం మందు మీదే బ్రతికాను. ఒకసారేమైందంటే -" అంటూ మొదలెట్టి - ఓ అరగంట ఊపిరి సలపనివ్వడు.

ఇప్పుడొచ్చిన తలనొప్పికి, కాఫీతాగినా రానికడుపు నొప్పికీ మధ్యలో నేను అవస్థలు పడుతూ ఇంకో కప్పు కాఫీగానీ, టీ గానీ దొరుకుతుందేమోననీ మా ఆవిడకోసం చూస్తున్నాను.

అప్పే... ఆవిడ నాకెక్కడ కనబడుతుందీ! వాళ్ళ అప్పచెల్లెళ్ళతో హస్కులో ఉంటుంది. మా అత్తగారు ఏదో పన్లమీద అటూ ఇటూ తిరుగుతూంటుంది గానీ - అవిణ్ణి అడగడానికి మొహమాటం!

ఈ టైములో వస్తాడు మా పెద్ద తోడల్లుడు శంకరం ముక్కుపొడుం దట్టిస్తూ... "ఇదేనా రావడం." అనేసి తిన్నగా వంటింట్లో కెళ్ళి ఓ కప్పుతో కాఫీ తనే తెచ్చేసుకుని మా దగ్గర సెటిలవుతాడు.



"నిన్న రాత్రి చాలా హైస్టేక్ ఆడా నండీ... ఆట చాలా రంజుగా సాగింది" అంటూ మొదలెడ్తాడు.

ఈయనకి పేకాట పిచ్చి. రోజుకి 26 గంటలు ఆడమన్నా ఆడేస్తాడు మహానుభావుడు. ప్రపంచంలో ఏ విషయమూ ఆయనకి అవసరంలేదు.

పేకాట తర్వాత ఆయన లైక్ చేసేది కేవలం - సెకండ్ షో సినిమాలన్నీ - మసాలా దోసెనూ! కాఫీ గబ గబా లాగించేసి "ఉంటారు గా ఇప్పుడే వస్తా" అంటూ మాయమైపోతాడు. మరో కప్పు కాఫీ ఎలా దొరుకుతుందాని నేను ఆలోచిస్తుండగా మెరుపులా వచ్చి వెళ్ళిపోతుంది మా ఆవిడ. ఆ వేగంతో ఆ 'మెరుపు' పట్టుకుని కాఫీ తెప్పించుకుని త్రాగి సిగరెట్ ముట్టించి - కాలకృత్యాలు తీర్చుకుని బయటపడే సరికి పదకొండో పన్నెండో అవుతుంది.

ఈలోగా చూద్దును కదా - ఎప్పుడు స్నానాలు చేస్తారో, ఎలా తయారైపోతారు గాని మా తోడల్లుళ్ళిద్దరూ, హాయిగా వంటింట్లో సెటిలైపోయి మా అత్తగారు వేడి వేడిగా వడ్డిస్తూంటే - లాగించేస్తుంటారు.

"అదేమిటీ! 'అర్జెంటా'?" అంటే...

"బైటికెళ్ళే పనుందండి" అంటారు.

నేను స్నానం ముగించుకుని బట్టలు మార్చుకుని పెద్దాయనకదాని మా మామగార్ని కాస్త పలకరించేసరికి ఒంటిగంట దాటిపోతుంది.

కడుపులో ఎలకలు పరిగెడుతుంటాయి. 'ఆకలి' అడగలేం. చెబితే బావుండదు. బయటికెళ్దామంటే దగ్గర్లో హోటళ్ళు లేవు.

మా అత్తగారు అన్నీ సర్దుకుని భోజనాలు వడ్డించి పిల్చేసరికి - మా మామగారు "లేవండి" అనే సరికి రెండు గంటలౌతుంది.

ఈలోగా భోంచేసి బయటికెళ్ళిన తోడల్లుడు వచ్చేస్తాడు. భోంచేసిన మరో తోడల్లుడు మంచి మంచం చూసుకుని పక్క ఎక్కేస్తాడు.

మూడు గంటలకి భోజనం, అదే పండగ భోజనంచేసి బయట పడేసరికి ప్రాణం శోషవచ్చి తేరుకున్నంత పని- 'పోనీ కాస్త విశ్రమిద్దాం. నడుం వాలుద్దాం-' అనుకుంటే అప్పటికే అందరూ అన్నిచోట్లా హాయిగా సెటిలైపోయి ఉంటారు... మా తోడల్లుళ్ళు నిర్మొహమాటంగా!

ఇక చూస్కోండి నా పండగ బడలిక - ఇంటికొచ్చాక రెండు రోజులకి గాని నా ఆరోగ్యం కుదుటపడదు. పేరుకి తోడల్లుళ్ళుగాని వాళ్ళు దేంట్లోనూ ఎవరికీ తోడవరు! పండగలకెందుకొస్తారో కనీసం నాకు అర్థం కూడా కాదు.

ఈలోగా మరో పండగొస్తుంది నా ప్రాణాలను తోడ్డానికి. హట్సాఫ్ టు మై తోడల్లుళ్ళు!


ఆకెళ్ళ గిరిజ,
21-138-2, ఫ్లాట్ నం - 41,
ఉత్తమ్ నగర్, I క్రాస్,
హైదరాబాదు - 47